


# ఆదిలాబాద్-మంచిర్యాల



# సూర్య

నేటి దినపత్రిక

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్

శనివారం, 30 డిసెంబర్ 2023 8 పేజీలు

## బ్యాంక్ అకౌంటే అడగకపాయె!




## అర్హులైన లబ్దిదారులకే 6 గ్యారంటీల ప్రజాపాలన పథకాలు




## ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం 6 గ్యారంటీల పథకాల అమలు

### -జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

**ఆసిఫాబాద్ ప్రతినిది 29 డిసెంబర్ సూర్య మేజర్ న్యూస్**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొరకు 6 గ్యారెంటీల పథకాలు అమలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శుక్రవారం జిల్లాలోని రెబ్బెన మండలం కైర్ గాం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన 6 గ్యారంటీల ఫలాలను అందించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుండి జనవరి 6, 2024 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలో అందించాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 365 గ్రామపంచాయతీలు, 1 పురపాలక సంఘం ఉన్నాయని, దరఖాస్తుల స్వీకరణ కొరకు 1 వేయి 335 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు ఫారముతో పాటు ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ కొరకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తప్పనిసరిగా సమర్పించాలి

### -ఎన్నికల ఖర్చుల పర్యవేక్షకుడు శ్రీయాన్

**నిర్మల్ ప్రతినిధి,డిసెంబర్29,సూర్య మేజర్ న్యూస్**

ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల ఖర్చుల పర్యవేక్షకుడు శ్రీయాన్ అన్నారు. శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చుల పర్యవేక్షకులు శ్రేయాన్ మాట్లాడుతూ అందరూ అభ్యర్థులు వారి వారి ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశించిన






నమూనాలు నిర్దేశించిన రిజిస్టర్ లలో రసీదులతో సహా వారు ఉపయోగించిన బ్యాంక్ అకౌంట్ నంబర్లతో సహా సమర్పించాలని లేనిపక్షంలో తదుపరి ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా పరిగణించబడతారన్నారు. ఇప్పటినుండి వారం రోజులలో ఈ ప్రక్రియ మొత్తం పూర్తవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ ఆర్డీవోలు రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్నికల ఖర్చుల సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన లబ్దిదారులకే 6 గ్యారంటీల ప్రజాపాలన పథకాలు

## జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) సబావత్ మోతిలాల్

**మంచిర్యాల ప్రతినిధి,డిసెంబర్29,సూర్య మేజర్న్యూస్:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన లబ్దిదారులకు 6 గ్యారంటీల పథకాలు అందజేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని వేమనపల్లి మండలం మల్కలపేట,చెన్నూర్ పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో 6గ్యారంటీల పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు,మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు ఫారాలు అందించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి వార్డు / గ్రామ సభ వద్దకు రావాలని,దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారములో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్దిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.జనవరి 6, 2024 వరకు (ప్రభుత్వ సెలవులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 8 గం.ల నుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు, మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 6 గం.ల వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.




జిల్లాలోని 311 గ్రామపంచాయతీలు, 7 పురపాలక సంఘాలలో దరఖాస్తుల స్వీకరణ కొరకు 1 వేయి 702 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాలలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణ కొరకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణలో స్త్రీ, పురుషులకు వేర్వేగా క్యూ లైన్లు, మహిళల కొరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ కౌంటర్లు, త్రాగునీరు,టెంట్లు,కౌంటర్ల కొరకు టేబుళ్ళు, క్యూ లైన్ల కొరకు బారీకేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తు ఫారముతో పాటు ఆధార్ కార్డు,తెల్లరేషన్ కార్డు జతపరచాలని, దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని, స్వీకరించిన దరఖాస్తును ఆన్లైన్లో నమోదు చేసి ప్రతి దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్యను కేటాయించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాసర మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**బాసర్,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

బాసర మండలంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో స్థానిక శాసనసభ సభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మండలంలోని ఆయా గ్రామాల సమస్యలు,పరిష్కారాలను గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం మార్గం చూపాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు సునీత విశ్వనాథ్ పటేల్,భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,బాసర జెడ్పీటీసీ వసంత రమేష్,వైస్ ఎంపీపీ నర్సింగ్ రావ్, పిఏసిఎస్ ఛైర్మన్ వెంకటేష్ గౌడ్, ఎమ్మార్వో,ఎంపీటీసీలు,సర్పంచులు,వివిధ శాఖల అధికారులు ఉన్నారు.




## ఫారాల కొరతతో ఇబ్బంది పడ్డ ప్రజానీకం

### - అధిక ధరలకు విక్రయించి క్యాష్ చేసుకున్న జిరక్స్ సెంటర్ల నిర్వాహకులు

**కడెం,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**



ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం రెండవ రోజు సందడిగా సాగింది. కడెం మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో నిర్వ హించిన 'ప్రజాపాలన' కార్యక్రమము నకు ఆర్డివో రత్న కళ్యాణి హాజరై అధికారులకు పలు సూచనలు చేశారు. అదే విధంగా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలకు ప్రజలు దరఖాస్తులు చేసుకుని రసీదులను తప్పక పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటేశ్వర్, జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఆకుల బలవ్వ లచ్చన్న, మూస్కు రాజు అధికారులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# కొవిడ్ పై ఆందోళన వద్దు

## -జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. జి.సి. సుబ్బారాయుడు



**మంచిర్యాల ,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్:**

ప్రస్తుతం వ్యాపిస్తున్న కొవిడ్పై ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అవగాహన కలిగి ఉండి శుభ్రత పాటించాలని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా౹౹ జి.సి. సుబ్బారాయుడు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో డి.ఎస్.ఓ. డా? ఫయాజ్తో కలిసి కొవిడ్పై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ కొవిడ్ వ్యాప్తిపై ప్రజలు భయాందోళన చెందవలసిన అవసరం లేదని, కొవిడ్ వైరస్ వ్యాప్తి నియంత్రణపై అవగాహన కలిగి ఉండి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లాలోని 152 ప్రభుత్వ ఆసుపత్రులు, 17 ప్రైవేట్ ఆసుపత్రులలో కొవిడ్ చికిత్స అందించడం జరుగుతుందని, 246 ఐ.సి.యు. పడకలు, 372 ఐసోలేషన్ పడకలు, 77 వెంటిలేటర్స్, 502 సాధారణ పడకలు అందుబాటులో ఉంచడంతో పాటు 175 మంది వైద్యులు, 426 మంది వైద్య సిబ్బంది, 491 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించడం జరిగిందని, 304 ఆక్సోమీటర్లు, 7 వేల 348 పి.పి.ఈ. కిట్లు, 20 వేల 715 మాస్కులతో వైద్య సేవలు అందించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న జె.ఎన్. -1 వేరియంట్ వైరస్ నియంత్రణపై ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉ న్నామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యాధికారులు వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉన్నారని, ప్రతి రోజు 10 మందికి పరీక్షలు చేసే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కొత్త వేరియంట్ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందని, 10 సం.ల లోపు పిల్లలు, 60 సం.ల వయస్సు దాటిన వృద్ధులు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సామాజిక దూరం పాటించడం,మాస్క్ ధరించడం,చేతులు శుభ్రపర్చుకోవాలని, అవసరమైతేనే బయటకు వెళ్ళాలని తెలిపారు. వేరియంట్లో జ్వరం, దగ్గు,గొంతునొప్పి, శాసలో ఇబ్బందులు తలెత్తుతాయని, అనుమానం ఉన్నట్లయితే వెంటనే పరీక్షలు చేసుకొని అవసరమైన మందులు వాడాలని, ఆసుపత్రులలో అన్ని రకాల చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అన్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కొవిడ్ వ్యాప్తి నియంత్రణ సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిచందర్ రెడ్డి, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సూర్య
శనివారం,30 డిసెంబర్ 2023

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.సర్పంచ్ పంద్రం సుగుణ



**ఆదిలాబాద్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్**

కేంద్ర ప్రభుత్వ పథకాలను,ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.సర్పంచ్ పంద్రం సుగుణ కోరారు.ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామపంచాయతి కార్యాలయంలో గ్రామీణ ప్రాంత ప్రజలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్ ,జన ఆరోగ్య యోజన ,జన్ దన్ యోజన, పిఎం సురక్ష భీమ జీవన్ జ్యోతి, అటల్ పెన్షన్ స్వానిది యోజన, హెల్త్ కార్డులు అర్హులైన లబ్ధిదారుల ఉజ్వల పథకం, మహిళా సంక్షేమ పథకాలు వినియోగం ఆపత్కాలంలో ఆదుకునే బ్యాంకు ఇన్సూరెన్స్ నూతన పథకలైన విశ్వకర్మ యోజన,తదితర పథకాల గురించి గ్రామస్తులకు ప్రచార రథం ద్వారా గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ ఎస్బిఐ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్,మితున్, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎం కవిత అంగన్వాడీ సుశీల,శోభ ఐకేపి,శ్రీనివాస్, బిపిఎం అప్క శ్రీనివాస్,ఆశ వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాసనసభ ఎన్నికల అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందించాలి

### జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

**ఆసిఫాబాద్ ప్రతినిధి 29 డిసెంబరు సూర్య మేజర్ న్యూస్**

ఇటీవల జరిగిన శాసనసభ నియోజకవర్గాల సాధారణ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల ఖర్చుల పరిశీలకులు అనునై భాటియా తో కలిసి శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లు, సహాయ వ్యయ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30 వ తేదీన శాసనసభ నియోజకవర్గాల సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగిందని, ఈ నెల 3వ తేదీన కౌంటింగ్ అనంతరం ఫలితాల ప్రకారం శాసనసభ్యులను ప్రకటించడం జరిగిందని తెలిపారు. నేనే పద్యంలో ఎన్నికల సందర్భంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారం కొరకు చేసిన ఖర్చులను పూర్తిస్థాయిలో అందించాలని తెలిపారు. జిల్లాలోని 001-సిర్పూర్ నియోజకవర్గంలో 13 మంది, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, వీరందరూ తమ ఖర్చుల వివరాలను 2 రోజుల లోగా సహాయ వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ కమిటీకి అందించాలని తెలిపారు. పార్టీలు అందించిన నిధులను పార్టీల ఖర్చులు, అభ్యర్థుల సంబంధిత ఖర్చులను అభ్యర్థుల ఖర్చులలో చూపించాలని, ఇట్టి వివరాలను భారత ఎన్నికల సంఘానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**బాసర్,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

బాసర్ మండలం కిర్గుల్ (బి) గ్రామంలో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ముధోల్ నియోజకవర్గం శాసనసభ సభ్యులు పవార్ రామారావు పటేల్ సందర్శించి పరిశీలించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కోసం జరుగుతున్న దరఖాస్తులలో ప్రజలకు ఇటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రాముల సర్పంచ్ లు, జెడ్పీటీసీలు ,ఎంపీటీసీలు,ఎంపీపీలు, బిజెపి నాయకులు,ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



## రెడ్ క్రాస్ సొసైటీ నందు ఉచితంగా హెచ్. ఎల్ .ఏ టెస్టులు



**మంచిర్యాల రూరల్, డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్.**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మంచిర్యాల జిల్లా శాఖ ఆద్వర్యంలో శుక్రవారం సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ బెంగళూరు వారి సహకారంతో తలసే మియా, సికిల్ సెల్ , సికిల్ తాల్ వ్యాదిగ్రస్తుల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించు కోవడానికి వ్యాదిగ్రస్తులకు వారి కుటుంబసభ్యులకు అందరికి ఉచితంగా హ్యూమన్ ల్యుకో సైట్ ఆంటిజెన్స్ టెస్టును చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ హరిచంద్ర రెడ్డి హాజరై మాట్లాడుతూ మంచిర్యాల రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో సుమారు 800 మంది వైద్యం పొందుతున్నారని,వీరందరికీ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు హెచ్.పి.ఎల్.సి, డి.ఎన్.ఏ పరీక్షలు వ్యాధిని నిర్ధారించుటకు అనేక పరీక్షలు క్యాంపులో నిర్వహిస్తున్నారన్నరని , అలాగే వ్యాధిని పూర్తిగా నయం చేయడానికి రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్,ఎం.సీ మెంబర్లు తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి నిర్మూలించుటకు అనేక అవగాహన సదస్సులు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని,వ్యాధిని పూర్తిగా నయం కావడానికి హెచ్.ఎల్.ఏ టైపింగ్ టెస్టును వ్యాధిగ్రస్తులకు వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు సుమారు 250 మందికి సంకల్ప్ ఫౌండేషన్ బెంగళూరు వారి సహాయంతో చేయడము హెచ్ ఎల్ ఏ మ్యాచ్ అయిన వారికి బోన్ మారో కూడా అతి తక్కువ ఖర్చులతో మార్పిడి చేయడం జరుగుతుందని సంకల్ప్ ఫౌండేషన్ వారిని కూడా అభినందించడం జరిగినది.సంకల్ప్ ఫౌండేషన్ సీఈవో రాకేష్,ప్రాజెక్టు మేనేజర్ అభిజిత్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ బోన్ మారో మార్పిడి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయముతో, ప్రధానమంత్రి నిధితో చేయించడం జరుగుతుందని దీనికి సంకల్ప్ ఫౌండేషన్ చాలా కృషి చేస్తుందని అన్నారు. తలసేమియా వ్యాధి లేని సమాజానికి సంకల్ప్ ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్,ఎడ్ల కిషన్,తల సేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్,బ్లడ్ బ్యాంక్ సూపర్వైజర్ కందుల మాధవి,పి.ఆర్.ఓ రాజేష్, స్టాఫ్ నర్స్ సంధ్య, మల్లేశ్వరి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## పదవికి రాజీనామా చేసిన బైంసా ఎంపిపి

**భైంసా,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

బైంసా మండల పరిషత్ అధ్యక్షురాలు కల్పన తన పదవికి రాజీనామా చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు.రాజీనామా ప్రతిని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఈఓ కు అందజేశారు.నిన్న వైస్ ఎంపిపి,నేడు ఎంపిపి రాజీనామాలు చేయడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.ప్రస్తుతం ఎమ్మెల్యే రామారావు పటేల్ గెలవడంతో బైంసా మండలంలో రాజకీయ సమీకరణలు మారిపోయాయి.ఎంపీటీసీలు అంతా బీజేపీ పక్షాన చేరుతుండడంతో ఇక ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాన్ని బిజెపి కైవసం చేసుకోనుంది.ముధోల్ రాజకీయాల్లో స్థానిక సంస్థలన్నీ తన వైపు చేసుకునేలా ఎమ్మెల్యే రామారావు పటేల్ చక్రం తిప్పుతున్నారు.



రెండవ రోజు కొనసాగుతున్న
## ఆరు గ్యారంటీల ధరఖాస్తులు



మంచిర్యాల టౌన్ డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్
తెలంగాణా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం ఆరు గ్యారంటీల పథకం దరకాస్తుల స్వీకరణ కార్యక్రమం రెండో రోజు మంచిర్యాల పట్టణంలోని ఆరవ వార్డులో జోరుగా సాగుతుంది ఈ కార్యక్రమంలో ఆరవ వార్డ్ కౌన్సిలర్ శ్వేత రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ అభయహస్తం ఆరు గ్యారంటీల పథకాల కోసం ధరకాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాజ్కుమార్ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన శిబిరాలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్



ఆదిలాబాద్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్
ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ అందడమే లక్ష్యంగా వారి పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలుస్తామని, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని వెంకట్రావుపేట శాంతినగర్ కైలాస నగర్ లో జరుగుతున్న ప్రజా పాలన దరఖాస్తుల కేంద్రాలను సందర్శించి చైర్మన్ పరిశీలించారు. ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి సిబ్బందికి పలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీఎన్నికలలో ఇచ్చినప్రతి హామీలను,అమలు చేసే విధంగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున ప్రశ్నిస్తుందని అన్నారు. పట్టణంలోని 49 వార్డుల్లో బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు,అందుబాటులో ఉండి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. రైతుబంధు విషయంలో అధికారులు మరో మాట చెప్పుతు మంత్రులు ఒక మాట అధికారులు ఇంకో మాట చెప్తున్నదంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వివరణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రామ్ కుమార్. సూర్య భాను.సునీల్. సుదర్శన్. తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ పొందిన అధ్యాపకునికి ఘనంగా సన్మానం


భైంసా,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్
భైంసా పట్టణంలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గంగాధర్ ఇటీవలే డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా భైంసా పట్టణ సరస్వతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సంజీవ్ కుమార్ ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



# బ్యాంక్ అకౌంటే అడగకపాయె!

- అభయహస్తం దరఖాస్తులో లేని ఖాతా నంబర్ ఆప్షన్
- గృహలక్ష్మి, రైతుభరోసా వంటివి అమలెట్ల?
- ప్రజల నుంచి అధికారులకు పలు ప్రశ్నలు

ఆదిలాబాద్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తుంది,ఆరు గ్యారెంటీలకు ఒకే దరఖాస్తు! ఇవ్వడంతో కానీ, ఆ ఒక్క దరఖాస్తుపై ప్రజలకు అరవై సందేహాలు!!మొదలు అయ్యాయి. ప్రజాపాలన కార్యక్రమంలో ఇస్తున్న దరఖాస్తులకు సంబంధించి ప్రజల్లో అనేక సందేహాలున్నా.. ప్రభుత్వం వైపు నుంచి వాటిపై స్పష్టత, తగిన సమాధానం రావడం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



### అనేక ప్రశ్నలు

ఫారంలో బ్యాంకు అకౌంట్ నంబర్ నమోదుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో పథకాలు ఎలా అమలు చేస్తారంటూ అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మహిళలకు ప్రతినెలా రూ.2500 సాయం, రైతుభరోసా సాయం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల సాయం కింది అర్హులకు ఆ మొత్తాన్ని బ్యాంకులో నగదు బదిలీ పద్ధతిలో జమ చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు దరఖాస్తులో అకౌంట్ నంబర్‌కు కాలం లేకపోడంతో ప్రజలంతా విస్మయం వ్యక్తం చేశారు. ఈ హామీలను ఏ విధంగా అమలు చేస్తారని మొదటిరోజే అధికారులను ప్రజలు నిలదీశారు. సమాధానాలు చెప్పలేక అధికారులు కూడా చేతులెత్తేశారు. ఒక ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అందరికీ రూ.2500 ఇస్తారా? లేక ఒక్కరికే ఇస్తారా? అని మహిళలు ప్రశ్నించారు. భర్తకు పింఛన్ వస్తే భార్యకు ఇవ్వ రా? అని అధికారులను అడగడం కనిపించింది. రేషన్‌కార్డుల్లో తల్లీకూతుళ్ల పేర్లుండి, కూతురి పెళ్లయిపోతే అత్తగారింటి వద్ద మహాలక్ష్మి డబ్బులు జమ చేస్తారా? లేక తల్లిగారింటి వద్ద దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నలు వినిపించాయి.ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, వితంతు తదితర పెన్షన్ తీసుకుంటున్న మహిళలకు కూడా అదనంగా 2500 ఇస్తారా? లేక ఏదైనా ఒక్క పెన్షన్ మాత్రమే ఇస్తారా? అన్న సందేహాలను మహిళలు వ్యక్తం చేశారు.

కౌలు రైతుల కాలమ్‌కు సంబంధించి సాగు చేస్తున్న భూమి సర్వే నంబర్‌తోపాటు పాసు పుస్తకం వివరాలు కూడా దరఖాస్తులో ఇవ్వాల్సి ఉంటుంది. కానీ భూ యజమానితో అధికారిక ఒప్పందం లేకుంటే సదరు వివరాలను ఏ విధంగా నమోదు చేయాలని పలువురు కౌలు రైతులు అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీలో రైతు కూలీగా జాబ్ కార్డు ఉంటేనే ఏడాదికి ఇచ్చే రూ.12 వేల కోసం దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తులో ఉన్నది. దీంతో జాబ్‌కార్డులు లేని కూలీలు దరఖాస్తు కౌంటర్ల వద్ద అధికారులతో గొడవపడటం కనిపించింది.

### సిలిండర్ల రాయితీపై కూడా స్పష్టత లేదు

ఎన్ని సిలిండర్లకు రాయితీ ఇస్తారన్నది చెప్పకుండా ఏటా ఎన్ని సిలెండర్లు వాడుతున్నారని ఫారంలో ప్రశ్న అడిగారు. దీం తో ఎన్ని సిలిండర్లు వాడితే అన్నింటికి రా యితీ ఇస్తారా? లేక కొన్నింటికి మాత్రమే రాయితీ ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నదా? అంటూ అధికారులను దరఖాస్తు దారులు అడగడం కనిపించింది. ఉద్యమకారులకు ఇంటి స్థలం ఇవ్వడానికి సంబందించి దరఖాస్తులో పోలీసు ఎఫ్ఐఆర్ నంబర్ (ఎఫ్ఐఆర్), జైలుకు వెళ్లిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. అంటే, తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లకుండా శాంతియుతంగా రోజుల తరబడి దీక్షలు చేసినవారికి గుర్తింపు లేదా? అని పలువురు ఉద్యమకారులు ప్రశ్నించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చే అంశంపై ప్రజల్లో అనేక సందేహాలు కనిపించాయి. అద్దె ఇండ్లలో ఉండేవారికి తమ పేరుతో కనెక్షన్ ఉండదు. మరి యజమానికి ఉచిత విద్యుత్తు వస్తుందా? కిరాయికి ఉండేవాళ్లకు వస్తుందా? అని చాలా మంది ఆరా తీశారు. 200 యూనిట్లపైన వాడుకునే విద్యుత్తుకు మాత్రమే బిల్లు చెల్లించాలా? లేక 200 యూనిట్లు దాటితే మొదటి యూనిట్ నుంచి మొత్తం కలిపి బిల్లు వేస్తారా? అని దరఖాస్తు దారులు ప్రశ్నించారు.రేషన్‌కార్డులు లేకపోవడంతో తాము ఎలా దరఖాస్తు చేయాలంటూ అధికారులను అడగడం కనిపించింది. ఆధార్‌కార్డు ఉన్నా దరఖాస్తులు తీసుకుంటామని కొంతమంది చెప్పగా.. రేషన్ కార్డు లేకపోతే దరఖాస్తులు తీసుకోబోమని మరికొన్నిచోట్ల అధికారులు, ప్రభుత్వం సిబ్బంది చెప్పడం కనిపించింది.దరఖాస్తు ఫారాలు దొరకక జిరాక్స్ సెంటర్ల చుట్టూ ప్రజలు తిరగడం కనిపించింది. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దరఖాస్తు ఫారాలను తమకు సంబంధించిన వారికి మాత్రమే పంచుకొన్నారనే విమర్శలు వినిపించాయి.దరఖాస్తు చేసేందుకు ఆదాయ, కుల ధ్రు వీకరణ పత్రాల అవసరం లేకపోయినా కొన్నిచోట్ల అధికారులు ఆయా పత్రాలు కావాలని చెప్పడంతో ప్రజలు వాటి కోసం పరుగులు తీశారు.ఇప్పటికే రైతుబంధు తీసుకుంటున్నవారు కూడా రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలా? అని రైతులు ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

# నేరడిగొండ చేరుకున్న మహా పాదయాత్ర

నేరడిగొండ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్,
మూడోసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావాలని,కోరుతూ నిర్మల్ జిల్లా కుభీర్ నుండి అయోధ్య వరకు జాదవ్ మాధవ్ ,అనే వ్యక్తి ఈనెల 26 న చేపట్టిన మహ పాదయాత్ర శుక్రవారం నేరడిగొండ మండలానికి చేరుకోన్నారు. మండల బీజేపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికన,అనంతరం ఆయనకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ చంద్రుని దయతో ఆయన చేపట్టిన ఈ మహ పాదయాత్ర కార్యక్రమం నిర్విఘ్నంగా విజయవంతం కావాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్ సింగ్, ఓబిసి మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపల్లి రాములు, జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి గంగా రెడ్డి, రమేష్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు



# ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాట్లు, పనితీరును పరిశీలించిన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిణి యం.ప్రశాంతి

**ఆదిలాబాద్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్**

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ప్రత్యేక నోడల్ అధికారిణి యం.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ద్వారకానగర్, రాణిసతిజి కాలనీ, భుక్తాపూర్, మావల మండలకేంద్రంలోని గ్రామపంచాయతి, ఆదిలాబాదు గ్రామీణ మండలంలోని చించుఘాట్‌లలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ,ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం గ్యారంటీలకు సంబందించిన దరఖాస్తులను జనవరి 6 వతేది వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఒకే కుటుంబం లోని సభ్యులు అందరికీ రేషన్ కార్డు లేకపోయినా వారి తల్లిదండ్రుల రేషన్ కార్డు లో నమోదై వున్నా పేర్లను బట్టి, తల్లిదండ్రుల రేషన్ కార్డు నెంబర్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల మంచి స్పందన వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 6'గ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను పూరించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరమైన సలహాలు, సూచనలు అధికారులు అందించాలని సూచించారు. దరఖాస్తుదారుడు దరఖాస్తుతో పాటు ఆధార్,రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు , అందేవిధంగా పనిచేయడమే ప్రభుత్వ అధికారుల లక్ష్యమని తెలిపారు. దరఖాస్తు దారులకు తప్పనిసరిగా రశీదు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బుగుప్త, జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమీషనర్ శైలజ, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.






# గ్రామీణ ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలు

## -వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో జిల్లా నోడల్ అధికారి, ఎల్ డి ఎం కె చంద్రశేఖర్

**నిర్మల్ ప్రతినిధి, డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తేవడం జరిగిందని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి ,ఎల్ డి ఎం కె చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణ కేంద్రంలో ఉదయం అంబేద్కర్ చౌరస్తా, మధ్యాహ్నం శివాజీ చౌక్ లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పథకాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానికులతో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. క్యాలెండర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను సెల్ ఫోన్ ద్వారా స్కానింగ్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు తెలిసిపోతాయని, ఆ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి ,ఎల్ డి ఎం కె చంద్రశేఖర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పట్టణ ,గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను, అనుభూతులను స్వయంగా వివరింపజేశారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ పథకాల ప్రయోజనాలు అందుతాయని, అందుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా మీ ముంగిటకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# లారీలో రేగిన మంటలు

## -మంటల్లో లారీ దగ్ధం
## -తప్పిన పెను ప్రమాదం

**ఆదిలాబాద్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్ :**

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని సీత గొంది గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న కంటైనర్ లారీ అగ్ని ప్రమాదం సంభవించి దగ్ధమైంది. మహారాష్ట్రలోని అంబాల నుంచి,బెంగలూరుకు లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ క్యాబిన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై వెంటనే జాతీయ రహదారిపై లారీని నిలిపివేసి కిందికి దిగారు.అయితే లారీని చూస్తుండగానే మంటలు అంటుకొని ముందు భాగం కాలిపోయింది. క్యాబిన్లో మంటలు అంటుకున్నాయని గమనించిన కంటైనర్ లారీ డ్రైవర్ రామ్ కుమార్ క్లీనర్ తో కలిసి దూరంగా వెళ్లారు. అయితే ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ తోనే జరిగిందని డ్రైవర్ రాము వెల్లడించారు. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తిగా కాలిపోగా ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆదిలాబాద్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.వారు సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పి వేయగా, మండల పోలీసులు ప్రమాదం పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామన్నారు.అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోగా డ్రైవరు, క్లీనరు ప్రాణాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



# రెండవ రోజుకి రెండు వేల పైచిలుకు దరఖాస్తులు

**కడెం,డిసెంబర్29,సూర్య మేజర్ న్యూస్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమం రెండవ రోజు ముగిసింది.ఈ కార్యక్రమం మండలంలో మొదటి రోజు నచ్చన్ ఎల్లాపూర్, సారంగాపూర్, బాబా నాయక్ తండ, కల్లెడ లలో నిర్వహించగా రెండవ రోజు లింగాపూర్, మాసాయిపేట, అల్లంపల్లి, ఉడుంపూర్ గ్రామములలో చేపట్టడం జరిగింది అని మండల ఎంపిడిఓ వేకటేశ్వర్లు తెలిపారు. రెండవ రోజు ముగిసే సరికి మొత్తంగా 4152 కుటుంబాల నుండి 2666 దరకాస్తులు వచ్చినట్లు ఎంపిడిఓ తెలిపారు.



# ప్రజా పాలన దరఖాస్తులకు అనూహ్య స్పందన

**ముధోల్:29డిసెంబర్ సూర్య ,మేజర్ న్యూస్**

మండల కేంద్రమైన ముధోల్ తో పాటు మండలంలోని ముద్గల్ గ్రామంలో లబ్ధిదారుల నుండి రెండో రోజు ప్రజా పాలన దర ఖాస్తులకు శనివారం అనూహ్య స్పందన లభించింది. మండల కేంద్రమైన ముధోల్లోని గ్రామపం చాయతీ కార్యాలయంలో తహ సిల్దార్ అతికొద్దిన్ ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారెం టీల కోసం ముఖ్యమంత్రి ప్రవే శపెట్టిన పథకాల గురించి తాసి ల్దార్ చదివి వినిపించారు. దీం తో లబ్ధిదారుల దరఖాస్తుల స్వీ కరణ గ్రా మపంచాయతీ, కొలి గల్లీ, బుద్ధ వి హార్, శిశు మందిర్ ,రైతు వేదిక సావిత్రిబాయి పూలే మహిళా భవనం(పా త గ్రామపంచాయతీ) శివాలయంతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద 15 కౌంటర్ల ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా జనవరి 06 తేదీ వరకు ప్రత్యేక కౌంటర్లలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు,సర్పంచ్ రాజేందర్,ఉపసర్పంచ్ సంజీవ్,గ్రామపం చాయతీ ఈవో పోతన్న,ఆర్ఐ నారాయణ,ట్రాన్స్కో ఎఈ శ్రీకాంత్,ఏఈవో ప్రవీణ్,ఐకెపి సిబ్బంది వందేమాతరం,గోదావరి, వివోఏలు,అంగన్వా డీ ,గ్రామ పంచాయతీ సిబ్బంది నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.




# ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



**హాజీపూర్ , డిసెంబర్ 29 , సూర్య మేజర్ న్యూస్.**

మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామంలోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల, విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి పార్లమెంటు ఎంపీ బోర్లకుంట వెంకటేష్ ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండేవిటల్,మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన నాయకులు , కార్యకర్తలను ఉద్దేశించి నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ,ఎన్నికల్లో మన పార్టీ ఓడిపోయిందని బాధపడకుండా ,ప్రతిపక్ష హోదాలో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా,ప్రజల క్షేమమే ధ్యేయంగా పనిచేద్దామని,రాబోయే స్థానిక ఎన్నికల్లో మరియు పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపుదిశగా పనిచేద్దామని,ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేసి మళ్లీ తెలంగాణ గడ్డపైన గులాబీ జెండా ఎగరవేయాలని సూచించారు..అదే విధంగా ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా తాను అండదండగా ఉంటానని , ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యుడేనని ,మీలో ఎవరికి ఏ కష్టం,ఆపద వచ్చినా క్షణంలో మీ ముందు ఉంటానని కార్యకర్తలకు మనోధర్యాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల బిఆర్ఎస్ యువ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ,మున్సిపాలిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు ,ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ,ఎంపీపీలు,వైస్ ఎంపీపీలు,యువజన విభాగ నాయకులు విద్యార్థి విభాగ నాయకులు,ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు.

# గుండె పోటుతో సింగరేణి కార్మికుడు మృతి



**శ్రీరాంపూర్, డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా సిహెచ్పి లో శేఖర్ (వయసు 57 ) అనే కార్మికుడు గురువారం రెండో బదిలీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో రాత్రి చాతిలో నొప్పి రావడం వల్ల ఆసుపత్రికి తీసుకువెళ్లే క్రమంలో గుండె పోటుతో చనిపోవడం జరిగింది.విషయం తెలిసి కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ కే బాజీ సైదా, ఆర్ కె పి ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేశారు.

## శ్రీరాముని స్పర్శ అక్షింతల శోభయాత్ర

**నిర్మల్ ,డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్**



అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని స్పర్శ అక్షింతలు అయోధ్య ఆలయ చిత్రపటం, కరపత్రాలను నిర్మల్పట్టణ ప్రియదర్శిని నగర్లో శుక్రవారం శోభయాత్ర నిర్వహించారు. కాలనీవాసులు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో సన్నాయి మేళ తాళాలతో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం కార్యసిద్ధి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ అక్షింతలను జనవరి 1వ తేదీ నుంచి 15 వరకు ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# కుబీర్ బస్టాండ్‌లోని నిరుపయోగ మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకురావాలని డిపో మేనేజర్ కు వినతి



**కుబీర్,డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

కుబీర్ మండల కేంద్రంలోని బస్టాండ్ లో గల నిరుపయోగ మరుగుదొడ్లకు మరమ్మత్తులు నిర్వహింపచేసి వాడుకలోకి తేవాలని కోరుతూ కుబీర్ మండల సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ సాప పండరి శుక్రవారం బైంసా డిపో మేనేజర్ అమృతకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుబీర్ మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో మరుగుదొడ్లు ఉన్న అవి సరిగ్గా లేక, బయటకు వెళ్లలేక మహిళల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అంతేకాకుండా మహిళా ప్రయాణికులు,ప్రజల కోరిక మేరకు కుబీర్ బస్టాండ్ లో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మత్తులు నిర్వహించి ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా చేయాలని అన్నారు.వీరితో ఉపాధ్యాయులు ప్రకాష్ పటేల్,ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.



## అవుట్ సోర్సింగ్ సిసిలను తొలగించాలి

### -తహశీల్దార్ స్థాయి గల అధికారులను సిసిలుగా నియమించాలి



**ఆసిఫాబాద్ ప్రతినిధి 29 డిసెంబరు సూర్య మేజర్ న్యూస్**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్నత అధికారులకు ఇలాంటి విద్యార్హత లేని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సిసిలుగా పని చేస్తున్నారు,అయితే కొని ప్రజా సమస్యలు చెప్పాలంటే వారు చెప్పిందే ఆట వారి చేసేదే పాటల ఉంది,ముఖ్యంగా జిల్లా కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ స్థానిక బాడీ వారికి విద్యా అర్హత లేని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సిసి లుగా పని చేస్తున్నారు,జిల్లాస్థాయి కలెక్టర్‌కు ప్రభుత్వ శాఖలో పనిచేసే రెగ్యులర్ వారి నీ సీసీలుగా నియమించుకోవాలి కానీ కుమురం భీం జిల్లాలో ఉన్న కలెక్టర్లు అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే వ్యక్తులని సీసీలుగా నియమించుకొని అధికారులపై చలామణి చేయిస్తున్నారు.అవుట్ సోర్సింగ్ సీసీలు ఇష్ట రాజ్యాంగ అధికారులపై చలామను చేస్తున్నారు, ప్రజల సమస్యలు చెప్పాలన్న సీసీలు బాధ్యత రైతంగా వివరిస్తున్నారు, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే అవుట్ సోర్సింగ్ సీసీలని తొలగించి రెగ్యులర్ విధులు నిర్వహిస్తున్న అధికారులను సీసీలుగా నియమించుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది, ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికనంద్, గొడిసెల కార్తీక్, డివైఎఫ్ఐ జిల్లా కోశాధికారి డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం,శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లురి శ్రీకాంత్, పాల్గొన్నారు,

## శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ

**నిర్మల్ (డిసెంబర్ 29) సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు.విగ్రహ ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షులు తోకల అనిల్, మండలం ఉపాధ్యక్షులు పుస్పూర్ నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు మురళి గౌడ్, భీమేష్, నారాయణ, సంతోష్, చిరంజీవి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



## అభయాస్తం గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణ

**సోన్,డిసెంబర్29,సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని మాదాపూర్, న్యూ వెల్మల్ గ్రామాలలో శుక్రవారం



అధికారులు ప్రజా పాలనలో భాగంగా అభయాస్తం ఆరు గ్యారంటీల కొరకు దరఖాస్తులను స్వీకరించారు. మాదాపూర్ గ్రామంలో జడ్పిటిసి జీవన్ రెడ్డి, తాసిల్దార్ శివరాజ్ లు అభయాస్తం దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులకు రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే ఆరు అభయస్తాం గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే న్యూ వెల్మల్ గ్రామంలో డిప్యూటీ సీఈవో శంకర్ అభయాస్తం దరఖాస్తుల స్వీకరణలో పాల్గొని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కళాకారులచే ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ ల గురించి కళారూపకంగా లబ్ధిదారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, మాదాపూర్ సర్పంచ్ రాజ నరసింహారెడ్డి, న్యూ వెల్మల్ సర్పంచ్ అంకం గంగామణి శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మకు బాల్క ఫౌండేషన్ చేయూత



**రామకృష్ణాపూర్, డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్.**

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నివాసం వుండే ఈర్ల బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని పార్టీ పట్టణ ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బాల్క సుమన్ ఆ కుటుంబానికి దశ దినకర్మ కార్యక్రమం కొరకు 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేయాలని స్థానిక నాయకులను ఆదేశించడంతో పట్టణ బిఆర్ఎస్ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి, మనోధర్యం కలిపించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాల్క ఫౌండేషన్ సహకారంతో అందించిన 50 కేజీల బియ్యాన్ని, నిత్యవసర సరుకులను బిఆర్ఎస్ పట్టణ ఇంచార్జి గాండ్ల సమ్మయ్య, వార్డ్ కౌన్సిలర్ పనాస రాజు చేతులు మీదుగా ఆ కుటుంబానికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. దింతో ఆ కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జ్ వేనంక శ్రీనివాస్, రాజశేఖర్, మెరుగు సతీష్, బండ్ల శ్రీను, కంది క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## సత్యవతి రాథోడ్ సోదరుని చిత్రపటానికి నివాళులర్పించిన జాన్సన్ నాయక్



**ఖానాపూర్ రూరల్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్**

మాజీ మంత్రి,ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ సోదరుడు గుగులోత్ కిషన్ నాయక్ ఇటీవలే స్వర్గస్థులు అవ్వగా, బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ మహబూబాబాద్ జిల్లా పెద్ద తాండాలోని వారి స్వగృహంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కిషన్ నాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులదే విజయం

### -ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ

**మందమర్రి టౌన్, 29 డిసెంబర్, సూర్య మేజర్ న్యూస్.**

సింగరేణి కాలరీస్ గుర్తింపు ఎన్నికల్లో ఎఐటియుసి సంఘం గెలుపు, అందించిన విజయం కార్మికులకే దక్కుతుందని, సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండరాదని ఒకవేళ అలా జరిగితే



గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియా కేకే5 గని మొదటి షిఫ్ట్ కార్మికులను కలిసి సింగరేణి కాలరీస్‌లో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న యూనియన్‌లను తిరస్కరించి, ఎఐటియుసిని గెలిపించినందుకు బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ సింగరేణి కార్మికులను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ భీమానదుని సుదర్శన్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఆర్గనైజర్ సెక్రటరీ గాండ్ల సంపత్, ఫిట్ సెక్రటరీ దేవసాని సాంబయ్య, సట్టా కొండయ్య, పోషిని వెంకటస్వామి, మేకల సంతు, గడ్డం సంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన సభను సందర్శించిన..మున్సిపల్ చైర్మన్

**నిర్మల్ ,డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ పట్టణంలోని షేక్ సాయిబ్ పేట్ లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అర్హులైన లబ్ధిదారులు ఏర్పాటుచేసిన కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ షాహిద్ తదితరులు ఉన్నారు.



## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

**ముధోల్:29డిసెంబర్, సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని ఎడ్ బిడ్ తాండకు చెందిన జాదవ్ అంబర్ సింగ్(53) అనే వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నట్లు ఎస్సై సాయికిరణ్ శుక్రవారం తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు జాదవ్ అంబర్ సింగ్ గత కొన్ని రోజుల నుండి అనారో గ్యానికి గురయ్యాడు. దీంతో మద్యానికి బానిసై మానసికంగా కృంగి పోయి జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహ త్యకు పాల్పడ్డాడన్నారు. మృతునికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు



## అభయహస్తం ప్రజాపాలనలో అర్హులందరు దరఖాస్తు చేసుకోండి

### పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్

**మందమర్రి టౌన్, 29 డిసెంబర్, సూర్య మేజర్ న్యూస్.**

గ్యారెంటీ పథకాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలు చేసే దిశగా చేపట్టిన అభయ హస్తం ప్రజాపాలన కార్యక్రమంలో పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరు ధరకాస్తు చేసుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 7,8,9,10 వ వార్డ్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన 5 గ్యారంటీ పథకాలైన రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ గృహాలు, చేయుత పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఐదు గ్యారెంటి పథకాలను వినియోగించుకోవాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డులలో జరుగుతున్నటువంటి ప్రజాపాలన కార్యక్రమంలో ఏమైనా సమస్యలు నెలకొంటే ఇన్చార్జిలు వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలన్నారు. చెన్నూరు శాసనసభ్యులు వివేక్ వెంకటస్వామి మందమర్రి పట్టణాన్ని అతి త్వరలో అభివృద్ధి పథంలో నడిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ ఇంజనీర్ అచ్యుత్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం రజిని, యువజన కాంగ్రెస్ నాయకులు మహంత్ అర్జున్, గడ్డం శ్రీనివాస్, ముడారపు శేఖర్, సీనియర్ నాయకులు చేగొండ శంకరయ్య, రాజు, రమేష్, సునీల్, సదానందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఖానాపూర్ మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయించాలని ఎమ్మెల్యే కు వినతి

**ఖానాపూర్ రూరల్ డిసెంబర్ 29 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీలో పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయించాలని ఖానాపూర్ తిమ్మాపూర్ అభివృద్ధి కమిటీలు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని బీర్నంది గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఖానాపూర్ విడిసి సంఘాల అధ్యక్షులు బిసి రాజన్న సతీష్ రావు దేశ్పాండే ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ చైర్మన్ కల్వకుంట్ల నారాయణ, వెంకటప్పయ్య,నేత శ్యామ్, ధ్యావతి రాజేశ్వర్, మధిరె సత్యనారాయణ, పుప్పల మురళి, పరంకుషం శ్రీనివాస్, సురపాక నర్సయ్య, అంకం నాగరాజు, మైలారం గంగాధర్, కటిక శ్రీనివాస్, కథలాపురం గంగా నర్సయ్య లతో పాటు విడీసీ సంఘ సభ్యులు పలువురు పాల్గొన్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో గత నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కొత్తగా ఏర్పాటు ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం గ్రామ అభివృద్ధికి ఆటంకమని సభ్యులంతా ఎమ్మెల్యే కు విన్నవించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో జనవరి ఐదున అవిశ్వాస తీర్మానం రద్దు చేయించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ వల్ల అభివృద్ధి జరగకపోగా, పిల్ల టాక్సు పెరిగాయని, ఉపాధి హామీ కూలీలు రోడ్డున పడ్డారని ఎమ్మెల్యేకు వివరించారు.అవిశ్వాసం రద్దుచేసి ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సభ్యులంతా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

**నిర్మల్ ( డిసెంబర్ 29) సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని దేవరకోట లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుప్పావై పాశురాలు 14వ రోజు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదాదేవి విగ్రహానికి మంగళ హారతులిచ్చి ప్రత్యేకపూజలు జరిపారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శ్రీధర్, ఇంచార్జీ ఈవో రవి కిషన్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి.ఎమ్మెల్యే పాయల్ శంకర్

**అదిలాబాద్ డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

ఎన్నికల వరకే రాజకీయ నాయకులు గెలిచిన తరువాత ప్రజా ప్రతినిధులు.ఎవ్వరైనా సరే ప్రజల మేలుకోసం పనిచేయాలి లేదంటే వారికి పుట్టగతులుండవు అని అన్నారు బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ద్వారక నగర్ కూలిపుర.కాలనీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పథకాలు ప్రవేశ పెడుతుంది.ఈ పథకాలను అర్హులైన ప్రజలందరికీ అందేలా చూస్తానని అన్నారు.ఎన్నికల్లో గెలుపుకోసం మాత్రమే రాజకీయాలు,గెలిచిన తరువాత ప్రజాప్రతినిధులు ప్రజల సంక్షేమం కోసం పని చేస్తారు.శంకరన్న మీ అందరివాడు మీకు ఏ సమస్య ఉన్న నన్ను నేరుగా సంప్రదించండి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ . అధికారులు జిల్లా నాయకులు కౌన్సిలర్ ఆకులప్రవీణ్,లాలామున్న,కృష్ణ యాదవ్,జోగు శైలజా రవి,ఆదినాథ్ ఆదిత్య ఖండేశ్వర్ పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరేట్లో పార్లమెంట్ ఎన్నికలపై సమావేశం

**నిర్మల్ , డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్**



నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పలు రాజకీయ పార్టీ నాయకులతో జాయింట్ కలెక్టర్ కిషోర్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సామరస్యంగా ఎన్నికలు జరగాలని తెలిపారు. జిల్లాలోని పోలింగ్ బూత్ స్థలాల మార్పులు చేర్పులు వంటి విషయాలు వారితో చర్చించారు.

## పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్ ప్రారంభం

**నిర్మల్, డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్లో పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్ ను జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ. ఈ క్యాంటీన్‌లో పోలీసు కుటుంబాలకు కావలసిన నిత్యావసర, ఎలక్ట్రానిక్ సరుకులు సబ్సిడీ ధరలకే అందుబాటులో ఉంటాయని తెలిపారు. నేటి సమాజంలో పోలీసు సేవలు మరువలేనివని, వారి సౌకర్యార్థం కోసమే వెల్ఫేర్ క్యాంటీన్ ను ఏర్పాటు చేశామన్నారు.

## కడ్తాల్ వద్ద అదుపుతప్పిన పండ్ల లారీ



**నిర్మల్ ,డిసెంబర్ 29, సూర్య మేజర్ న్యూస్**

నాగ్పూర్ నుండి హైదరాబాద్కు పండ్ల లోడ్తో వెళున్న లారీ నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామ శివారులో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదం ఘటనలో డ్రైవర్, క్లీనర్కు స్వల్ప గాయాలయ్యాయి.గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

**అదిలాబాద్ డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

పట్టణంలోని ద్వారకా నగర్ మాజీ ఎమ్మెల్యే,జౌళీ శాఖ మంత్రి పడాల భూమన్నని వారి నివాసంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్.మర్యాద పూర్వకంగా కలిశారు.ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే హోదాలో పడాల భూమన్నని కలిసి వారికి శాలువతో సన్మానం చేశారు. వారితో ప్రస్తుత సామాజిక పరిస్తితుల మీద చర్చించారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆకుల ప్రవీణ్,కౌన్సిలర్ లాలా మున్నా,కృష్ణ యాదవ్,ఆదినాథ్, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## గణనీయంగా తగ్గిన రోడ్డు ప్రమాదాలు.జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

**అదిలాబాద్ డిసెంబర్ 29,సూర్య మేజర్ న్యూస్**

స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశం మందిరం నందు జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం పత్రికా సమావేశంలో జిల్లా వార్షిక నేర నివేదిక వివరాలను వెల్లడించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో ప్రమాదాలను నివారించే లక్ష్యంగా పనిచేసిన జిల్లా పోలీసు యంత్రాంగం దానిని విజయవంతంగా పూర్తి చేసి గణనీయంగా ప్రమాదాలను తగ్గించగలిగామని తెలిపారు. జిల్లాలో మహిళలపై జరుగు నేరాల సంఖ్య తగ్గుముఖం కావడంలో తోడ్పాటు అందించిన షీటీం బృందాలు చేసిన కృషి ఎంతగానో దోహాదపడిందని తెలిపారు.ఆపద సమయంలో ప్రజలకు మేమున్నాం అంటూ నిమిషాల వ్యవధిలో చేరుకుని డయల్ 100 సేవలను మరింత మెరుగుపరచుకొని జిల్లా వ్యాప్తంగా మూడు నిమిషాల లోపు పోలీసులు సంఘటన స్థలాలకు చేరుకునేలా సిబ్బందికి నిరంతరంగా అవగాహనను కల్పిస్తూ మెరుగుపరచడం జరిగిందన్నారు జిల్లా వ్యాప్తంగా మత్తుపదార్థాల నిర్మూలనకై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీ చేస్తూ జిల్లాలో ఎటువంటి గంజాయి, మతపదార్థాలు లభించకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో పోలీసు ద్వారా ప్రజలకు చేసిన కార్యక్రమాలు.మెగా వైద్య శిబిరాలు 3,మావోయిస్టు ప్రభావిత మారుమూల గిరిజన గ్రామాలలో మూడు మెగా మెడికల్ కాలం క్యాంపులను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడంజరిగింది బ్లాంకెట్ల పంపిణీ మారుమూల గిరిజన, కొలాం ప్రజలకు 800 బ్లాంకెట్లను ఉచితంగా అందజేయడం జరిగింది. షీ టీం ఈ సంవత్సరం నందు 770 అవగాహన కార్యక్రమం ద్వారా వివిధ కళాశాలలో పాఠశాలల నందు విద్యార్థులకు,ప్రజలకు మహిళల రక్షణకై పోలీసు వ్యవస్థ తీసుకుంటున్న చర్యలు,సైబర్ క్రైమ్,బాల్య వివాహాలు, హ్యూమన్ ట్రాఫికింగ్ లాంటి అంశాలపై అవగాహనలు నిర్వహించడం.



### ఆపరేషన్ ముస్కాన్/స్మైల్

జిల్లా వ్యాప్తంగా చైల్డ్ వెల్ఫేర్ అధికారుల సహకారంతో 204 పిల్లలను మంది బాల,బాలికలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది. సి ఈ ఐ ఆర్ - 163 నూతనంగా ఈ సంవత్సరం ఆవిర్భవించిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రజలు పోగొట్టుకున్న 163 మొబైల్ ఫోన్లను తిరిగి వారికి అందజేయడం జరిగింది.సామాజిక మాధ్యమం అయిన ఫేస్బుక్,ట్విట్టర్,ఇంస్టాగ్రామ్, వాట్సప్ ద్వారా ప్రజలు చేసిన 60 కంప్లైంట్ లను తీసుకుని పరిష్కరించడం జరిగింది.ఈ సంవత్సరం ఏడుగురు సివిల్ కానిస్టేబుల్ లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించడం,ఒక జూనియర్ అసిస్టెంట్ కు సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి కల్పించడం జరిగింది.